క్లుప్తంగా

రోటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గం

పెనమలూరు: రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీవీపీ సిద్ధార్థ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. తొలుత రోటరాక్ట్ ఐదవ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం వీ ప్రసాద్ మాట్లాడుతూ గత సంవత్సరం ఉన్నత సేవలు అందించిన ప్రేమ్‌సాయిభూపతి, సతీష్‌లను కొనియాడారు. నూతన కార్యవర్గం కూడా విస్తృతంగా సేవలు అందించాలని సూచించారు. నూతన అధ్యక్షురాలిగా గాదే కావ్యతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ కె.రవికుమార్, భానుపూజిత్, డాక్టర్ శ్యామ్, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు సెంటర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలవటంతో పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు పల్లిపేటకు చెందిన మోకా రాజ్‌కుమార్ బోరు పనులు చేస్తాడు. అతను మంగళవారం పనికి వెళ్లలేదు. రాత్రి పెనమలూరు సెంటర్‌లో మద్యం దుకాణానికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలవటంతో అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

980 మంది చిరు వ్యాపారులకు సాయం

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకం కింద 6వ దఫా 980 మంది చిరు వ్యాపారులకు ఆర్థిక సాయం అందజేసిందని వెలుగు ఏపీఎం పి.చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని లబ్ధిదారులకందరికీ వారి బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున సోమవారమే జమ అయ్యాయన్నారు. గత ఆరు దఫాలుగా మండలంలో చిరు వ్యాపారాలు చేసుకొంటూ జీవనం సాగించే వారికి ప్రభుత్వం వడ్డీలేని రుణ సదుపాయం కల్పించిందన్నారు.

గంగూరులో ప్రభుత్వ కార్యాలయాల పరిశీలన



పెనమలూరు: గంగూరు గ్రామంలో బుధవారం అధికారులు విస్తృతంగా పర్యటించారు. రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ఈ నెల 26వ తేదీన గంగూరు గ్రామం పర్యటించే అవకాశం ఉందని సమాచారం రావటంతో మండల అధికారులు ఏర్పాట్లకు రంగంలోకి దిగారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వీటి ద్వారా అందిస్తున్న సేవలను గవర్నర్ పరిశీలించనున్నారు. ఎంపీడీఓ సునీతాశర్మ మాట్లాడుతూ గవర్నర్ వస్తారని సమాచారం వచ్చిందని ఏతేదీన వచ్చేది తెలియాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లో పర్యటన వివరాలు తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో నాంచారరావు, ఏవో లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

110 మందికి కంటి పరీక్షలు

కంకిపాడు: మండల కేంద్రమైన కంకిపాడులో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ 60 ఏళ్ల నిండిన 110 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు అవసరమైన వారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామని వివరించారు.

వృద్ధులకు అన్నదానం

కంకిపాడు: ఆపన్నులకు అండగా నిలవాలని మారేడుమాక సర్పంచ్ సీహెచ్ ఆదర్శకుమార్ అన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా మారేడుమాక కేంద్రంగా నిర్వహిస్తున్న మదర్‌థెరిస్సా వెలుగు వృద్ధుల ఆశ్రమ సేవాసంస్థ ద్వారా వృద్ధులకు బుధవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో తెన్నేరు సర్పంచ్ జుజ్జువరపు ఎలీషా, సేవాసంస్థ నిర్వాహకులు లాం స్వర్ణకుమారి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో సీసీఆర్‌సీ కార్డుల జారీ

- వాస్తవ సాగుదారులకు పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రం జారీ
- ఇప్పటికే 45,764 కార్డులు అందజేత
- నిర్దేశించిన లక్ష్యంలో 87 శాతం పూర్తి



సీసీఆర్‌సీ కార్డు నమూనా

కంకిపాడు: వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పంట సాగు హక్కు ధ్రువీకరణ పత్రం జారీ ద్వారా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు అందేలా మార్గదర్శకాలు జారీ చేసింది. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా రెవెన్యూ, వ్యవసాయశాఖ సంయుక్తంగా సీసీఆర్‌సీ కార్డులను అందిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో 87 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. నెలాఖరు నాటికి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ఆయా శాఖలు చర్యలు చేపట్టాయి.

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 1,79,118 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు జరుగుతున్నట్లు అంచనా. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1,79,140 హెక్టార్లలో వరి, జొన్న, మొక్కజొన్న, కందులు, పెసర, మినుము, వేరుశనగ, మిర్చి, పత్తి, చెరకు, పసుపు మొదలైన పంటలు సాగు జరుగుతాయని అంచనా. జిల్లాలో అధిక భాగం వ్యవసాయం కౌలుదారుల చేతుల్లోనే ఉంది. కౌలు ఒప్పందాలు జరిగి సాగు పనులకు ఉపక్రమించే తరుణమిది.

చురుగ్గా పంట సాగుహక్కు పత్రాల జారీ

వాస్తవ సాగుదారులకు (కౌలురైతులకు) పంట సాగు హక్కుపత్రాలు జారీ చేసే ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా చురుగ్గా సాగుతోంది. రెవెన్యూ శాఖ పర్యవేక్షణలో, వ్యవసాయశాఖ సమన్వయంతో సీసీఆర్‌సీ కార్డులను రైతు అంగీకారంతో జారీ చేస్తున్నారు. గతేడాది జిల్లాలో 50,065 కార్డులను అందించారు. ఈ ఏడాది 52,570 సీసీఆర్‌సీ కార్డులను అందించాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించింది. జిల్లాలోని 25 మండలాల్లో 508 గ్రామాల్లో జూలై ఆఖరునాటికి లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉంది. ఇప్పటికే 45,764 కార్డులను కౌలురైతులకు అందజేసి, 87 శాతం లక్ష్యానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో వ్యవసాయశాఖ సమన్వయంతో కార్డులను అందజేస్తున్నారు.

సీసీఆర్‌సీ కార్డుతో ప్రయోజనాలు ఇవి...

ఏపీ పంట సాగుహక్కు చట్టం ప్రకారం రుణఅర్హత, కార్డుదారు పంటరుణం, పంటలబీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, రైతుభరోసా, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వంటివి అందుతాయి. వ్యవసాయానికి చేయూత అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అన్నీ సీసీఆర్‌సీ కార్డులబ్దిదారు పొందుతారు. అయితే భూమిపై ఎలాంటి స్వాధీన హక్కులు కౌలురైతుకు ఉండవు. ఈ కార్డు ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఇచ్చిన పంట రుణాలు వసూలు చేసుకోవటంలో ఫలసాయంపై మాత్రమే హక్కులు కలిగి ఉంటాయి. కానీ భూమిపై హక్కులు ఉండవు. ఈ-క్రాప్ నమోదు కౌలురైతు పేరునే జరుగుతుంది. పంట విక్రయాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కౌలురైతు సంక్షేమం కోసం సీసీఆర్‌సీ కార్డులను లక్ష్యాలకు అనుగుణంగా అందజేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి రైతులను చైతన్యపరిచి, వాస్తవసాగుదారులకు భరోసా కల్పించేలా చర్యలు చేపట్టారు.

కౌలురైతుకు ఎంతో ప్రయోజనం

> సీసీఆర్‌సీ కార్డుల ద్వారా కౌలురైతులకు వ్యవసాయంలో ఊతం అందుతుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అందుకుంటారు. సీసీఆర్‌సీ కార్డుల జారీపై రైతులు అపోహలు విడనాడాలి.
>
> -ఎస్.పద్మావతి, జిల్లా వ్యవసాయాధికారి, కృష్ణాజిల్లా

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



ముస్తాబాదలో గ్రామస్తులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీడీవో సత్యకుమార్



వీరవల్లిలో విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



తేలప్రోలులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గత ప్రభుత్వ హయంలో సంక్షేమ పథకాలు మంజూరుకు జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగిన పరిస్థితి ఉంటే, నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయంలో ప్రజల చెంతకే వలంటీర్ల ద్వారా పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పలువురు ప్రజాప్రతినిధులు కొనియాడారు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామ సచివాలయం-1 పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ పిల్లా అనిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో 600 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. గత నాలుగేళ్లలో గ్రామంలో రూ.11.92 కోట్ల మేర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి జరిగిందని చెప్పారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కె.వెంకటరమణ, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, ఎంపీటీసీ సభ్యురాలు దూసరి నిర్మల, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొడెబోయిన బాబి, పార్టీ నాయకులు గూడవల్లి రత్న సుధాకర్, ఆత్మూరి బాలాజీ, తొమ్మండ్రు రమేష్, మోర్ల అంజనేయులు, గండి చిన్నారావు పాల్గొన్నారు.

పారదర్శక పాలనతో ప్రజలకు మేలు

గన్నవరం రూరల్ : ప్రజలకు మెరుగైన పారదర్శక పాలన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీడీవో సత్యకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని ముస్తాబాదలో జగనన్న సురక్షా క్యాంపు జరిగింది. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు నేరుగా అందిస్తున్న ఘనత ప్రభుత్వానిదన్నారు. ప్రతి ఒక్కరికీ అవసరమైన సర్టిఫికెట్లను ఈ క్యాంపుల ద్వారా అందజేస్తున్నామన్నారు. సర్పంచ్ వి.రాధాకృష్ణ, ఎంపీటీసీలు జి.భాగ్యరాజ్, షేక్ మున్ని, ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ అసిస్టెంట్ జెట్టి నానారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందజేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. తేలప్రోలు గ్రామ సచివాలయం-1 ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే సంక్షేమం అందజేస్తున్నారని అన్నారు. ఇంకా అర్హత ఉండి లబ్ధి పొందని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సత్వరమే సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం 415 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, సర్పంచ్ లాం దిబోర, ఉప సర్పంచ్, మండల సచివాలయ కన్వీనర్ వింత ఆదినారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి(వాసురెడ్డి), రామిరెడ్డి, రవికుమార్, కార్యదర్శి కృపాకుమార్, సచివాలయ గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ బీ రోడ్ల అభివృద్ధికి రూ.2.75 కోట్లు

ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్

గన్నవరం: నియోజకవర్గంలోని రెండు అర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.2.75 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ ఆదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధుల్లో గన్నవరం మండలంలోని చిక్కవరం నుంచి గోపవరపుగూడెం మీదుగా కొండపావులూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి రూ.2.15 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. బాపులపాడు మండలంలో ఎంఎన్‌కే రోడ్డు నుంచి పెరికీడు మీదుగా ఎస్‌ఎస్.పాలెం, వేలేరు వరకు రోడ్డు అభివృద్ధికి రూ.60 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఈ రోడ్ల అభివృద్ధిపై సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నిధులు కేటాయించినట్లు వివరించారు. త్వరలో టెండర్ల ప్రక్రియను పూర్తిచేసి రహదారుల నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులు గురించి తన దృష్టికిగాని, తన కార్యాలయం దృష్టికి తీసుకువస్తే వెంటనే అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ టీమ్ పరిశీలన



పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై స్వచ్ఛ సర్వేక్షన్ టీమ్ బుధవారం పరిశీలించారు. గ్రామంలో పబ్లిక్ ప్రాంతాల్లో, స్కూల్స్, దేవాయాల వద్ద పరిశుభ్రతను తనిఖీ చేశారు. వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, కామన్ లెట్రిన్స్ వినియోగం శుభ్రతలను గమనించారు. గ్రామంలో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని స్వచ్ఛ సర్వేక్షన్ టీమ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శి చెన్న కేశవరావు వారికి వివరాలు తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవోలు

గన్నవరం: మండలంలోని పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈవో రామ్‌బాల్ సింగ్ బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలలకు అవసరమైన పుస్తకాలను ఎప్పటికప్పుడు మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి నేరుగా సరఫరా చేస్తున్నట్లు ఎంఈవో తెలిపారు. ఎంఈవో-2 ఆర్.కమల, పలువురు సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎంఈవోలకు సత్కారం..

మండల విద్యాశాఖ అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన రామ్‌బాల్‌సింగ్, ఆర్.కమలను డెమోక్రాటిక్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సత్కరించారు. పీఆర్‌టీయూ మండల శాఖ ఇరువురు ఎంఈవోలకు దుశ్శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.జోజయ్య మాట్లాడుతూ..ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం మండలానికి ఇరువురు ఎంఈవోలను కేటాయించినట్లు చెప్పారు. దీనివల్ల విద్యాశాఖకు, ఉపాధ్యాయులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మండల ప్రధాన కార్యదర్శి డీఆర్ఎస్.నాయక్, సంఘ నేతలు వెంకటేశ్వరరెడ్డి, బాలశేఖర్, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న టిప్పరు

కంకిపాడు: కారును వెనుక నుంచి టిప్పరు ఢీకొన్న ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి కథనం మేరకు...హైదరాబాద్ ఎస్ఎస్ఆర్ కాలనీకి చెందిన నడకుదిటి విజయ రామరాజు కారులో పామర్రు నుంచి విజయవాడ వైపు వస్తూ దావులూరు టోల్ ప్లాజా వద్దకు రాగానే వెనుక నుంచి టిప్పరు వేగంగా వచ్చి కారును ఢీకొట్టడంతో కారు ధ్వంసమైంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

జూదరుల అరెస్టు

కంకిపాడు: పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను కంకిపాడు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అదనపు ఎస్ఐ జె.లక్ష్మి కథనం మేరకు... మండలంలోని జగన్నాధపురం పరిధిలో కోత ముక్క ఆడుతున్నట్లు సమాచారం రావటంతో పోలీసులు బుధవారం రాత్రి ఆ ప్రాంతంపై దాడిచేశారు. దాడిలో నలుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

అధికారులకు మెమోలు జారీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి నివేదనశాలలోకి సాధారణ భక్తుడిని అనుమతించడంపై దుర్గగుడి ఈవో భ్రమరాంబ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై నివేదన శాల ఏఈవో, సూపరింటెండెంట్, ఇతర అధికారులను వివరణ అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి నివేదనశాలలో జరిగిన ఘటనపై అర్చకులను ఆరా తీశారు. సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించడంతో పాటు తదుపరి విచారణ నిమిత్తం ఫుటేజీని తీసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని వైదిక కమిటీని ఆదేశించడంతో పాటు సంబంధిత అధికారులు, పర్యవేక్షకులు గురువారం నాటికి వివరణ ఇవ్వాలని మెమోలు జారీ చేశారు. ఈ ఘటన నేపథ్యంలో నివేదనశాలను సంప్రోక్షణ చేసినట్లు సమాచారం.

సేవలు సమర్థంగా అందేలా చర్యలు



ఈడుపుగల్లులో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కంకిపాడు: ప్రజలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వక్తలు పేర్కొన్నారు. ఈడుపుగల్లు-1 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటి సర్వే ద్వారా 635 మంది లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ఏ ఒక్కరూ పథకం అందక నష్టపోకూడదని అన్నారు. గతంలో మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం గ్రామంలోనే అన్ని రకాల ప్రభుత్వ శాఖల సేవలు అందుతున్నాయని వివరించారు. ప్రజలకు మంచి చేస్తున్న సచివాలయ, వలంటీరు వ్యవస్థను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.ఉదయ్‌బాస్కర్, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, సర్పంచ్ పి.ఇందిర, ఎంపీటీసీలు షేక్ అమీనాబి, బూరగ బాలాజీ, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, అగ్రిబోర్డు డైరెక్టర్ నకరికంటి శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు వీరమాచనేని శ్రీనివాసరావు, బిళ్లా వెంకటేశ్వరరావు, వల్లపరపు నాగరాజు, నాగదేశి బాలకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం



ఉయ్యూరులో గడపగడపకు మన ప్రభుత్వంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. స్థానికులు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల పంపిణీ చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఎల్లోమీడియా, ప్రతిపక్షాలు విష ప్రచారానికి తెరతీస్తున్నాయని మండిపడ్డారు. ప్రజా క్షేత్రంలో వాటికి ఎదురుదెబ్బ తప్పదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్ రాజులపాటి చిన్ని, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖలీల్, నాయకులు రాజులపాటి రామచంద్రరావు, షేక్ అబూకలాం, ఆరేపల్లి నాగరాజు, జంపాన రవి, జంపాన శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ ఉషారాణి

పెనమలూరు: కానూరులో అదృశ్యమైన బాలుడిని పోలీసులు వెంటనే ఆచూకీ తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. కానూరుకు చెందిన ఎం.నాని వ్యవసాయ కూలీ. అతనికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు థామస్ (7) కానూరు ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. మంగళవారం నాని తన కుమారుడు థామస్‌ను పాఠశాలలో దించి పనులకు వెళ్లాడు. అయితే సాయంత్రం నాని భార్య కుమారుడి కోసం పాఠశాలకు వెళ్లగా అక్కడ థామస్ కనిపించలేదు. గ్రామంలో విస్తృతంగా గాలించినా చిన్నారి ఆచూకీ తెలియక పోవటంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాలుడి ఫొటో వాట్సాప్ గ్రూప్‌లో పెట్టి గాలింపు చేపట్టారు. అయితే బాలుడు సైకిల్ తొక్కుకుంటూ మంగళవారం రాత్రి పోరంకి శివారు ప్రాంతం సాలిపేట పొలాల వద్ద కనపడడంతో స్థానికులు అతనిని తమ వద్దే జాగ్రత్తగా ఉంచి, బుధవారం ఉదయం పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి సీఐ కిషోర్‌బాబు తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు.

ఖోఖో సంఘ సమావేశం వాయిదా

విజయవాడ స్పోర్ట్స్: ఈ నెల 30వ తేదీన జరగాల్సిన ఉమ్మడి కృష్ణా జిల్లా ఖోఖో అసోసియేషన్ సంఘ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు కృష్ణాజిల్లా ఖోఖో సంఘం అధ్యక్షుడు టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గన్నవరంలోని రోటరీ హాల్‌లో ఈ సమావేశం నిర్వహిస్తామని ఇటీవల ప్రకటించారు. కొన్ని అనివార్య కారణాలతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రసాద్ వెల్లడించారు.

చోరీ కేసులో ఇద్దరు నిందితులకు రిమాండ్

బంటుమిల్లి(పెడన): మండల పరిధిలోని ముంజులూరు గ్రామంలో ఈ నెల 2వ తేదీన జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. కేసు వివరాలను బుధవారం ఎస్ఐ ఎ. పైడిబాబు తెలిపారు. గ్రామానికి చెందిన గంటా రాజేశ్వరి ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 2న ఇంటికి తాళం వేసి బంటుమిల్లి కార్యాలయానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులకొట్టి ఉంది. ఇంట్లో బీరువాల్లో భద్రపరచిన బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 19న ముంజులూరు సమీపంలోని లజ్జబండ డ్రెయిన్ వద్ద అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులు తిరుగుతున్నారన్న సమాచారంపై పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు విషయం బయటపడింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న పంపన సాయి, కర్రా లాజర్ పాత నేరస్తులుగా విచారణలో తేలింది. వారి నుంచి రూ. 1.60 లక్షల విలువ చేసే 38 గ్రాముల బంగారం, 36 గ్రాము ల వెండి వస్తువులను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ప్రణాళికతో విద్యనభ్యసిస్తే విజయం తథ్యం



సదస్సులో ప్రసంగిస్తున్న నాగేశ్వరరావు, వేదికపై తేజోవతి, జగదీష్, శ్రీధర్, రోజేష్‌బాబు, నాగేశ్వర శర్మ

విజయవాడ కల్చరల్: విద్యార్థులు ప్రణాళిక, సంకల్పం, పట్టుదలతో కృషి చేస్తే విజయం తథ్యమని యువజన సర్వీసుల శాఖ అసిస్టెంట్ మేనేజర్ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. యువజన సర్వీసుల శాఖ ఎన్టీఆర్, కృష్ణా జిల్లా శాఖల ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని శారదా కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అంశంగా అవగాహనా సదస్సును బుధవారం నిర్వహించారు. సదస్సును ప్రారంభించిన నాగేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్య సాధనే ధ్యేయంగా చిత్తశుద్ధి, ఏకాగ్రతతో విద్యను అభ్యసించాలన్నారు. అధ్యాపకులను సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు తేజోవతి, జగదీష్‌లు మాట్లాడుతూ.. దృఢమైన మనస్సు, మంచి స్నేహితులు, మంచి ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. అవగాహన సదస్సులో కళాశాల కరస్పాండెంట్ ఎస్ఎస్ వరప్రసాద్, ఇంటర్మీడియెట్ విభాగం ప్రిన్సిపాల్ లుక్కా శ్రీధర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పట్లిల రోజేష్‌బాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరశర్మ పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన పలు సమస్యలకు నిపుణులు పరిష్కారాలు చెప్పారు.